రేషన్ కార్డుల కోసం మీ సేవలో దరఖాస్తు చేసుకోండి

● మలక్‌పేట ఎమ్మెల్యే బలాల


వీడియో క్లిప్‌లో వివరిస్తున్న ఎమ్మెల్యే బలాల

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్‌కార్డుల కోసం అర్హులైన కుటుంబాలు మీ సేవలో దరఖాస్తు చేసుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల తెలిపారు. ఈమేరకు సోమవారం వీడియో క్లిప్ ద్వారా ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. కొత్త రేషన్‌కార్డుల కోసం మీ సేవలో దరఖాస్తు చేసుకోవాలని ఆదేశించిన తెలంగాణ ప్రభుత్వం తిరిగి నిలిపివేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. దీనిపై మజ్లీస్ పార్టీ తరఫున తెలంగాణ ప్రభుత్వం చేసిన విజ్ఞప్తి మేరకు కొత్తగా రేషన్‌కార్డుల కోసం మీ సేవలో దరఖాస్తు చేసుకోడానికి అవకాశం కల్పించినట్లు ఆయన వివరించారు.

తాగునీటి పైపులైన్ పనులకు శంకుస్థాపన

చంపాపేట, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ మారుతీనగర్‌నగర్‌కాలనీలో జీహెచ్ఎంసీ నిధులు రూ.11.50లక్షలతో చేపట్టనున్న తాగునీటి సరఫరా పైపులైన్ నిర్మాణ పనులకు సోమవారం కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మారుతీనగర్ కాలనీ అధ్యక్షుడు రమేష్‌కుమార్, కాలనీప్రతినిధులు శ్రీనివాస్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, నవీన్, శివకుమార్, మురళీధర్‌రెడ్డి, ఖాదీర్, శంకర్‌నాయక్, బలరాం రెడ్డి, రాజు, ఈశ్వరయ్యగౌడ్, సుమిత్‌సింగ్, వినోద్ పాల్గొన్నారు.

స్థానిక పోరులో బీజేపీని గెలిపించుకుందాం

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): స్థానిక పోరుకు బీజేపీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా సీనియర్ నాయకుడు వడ్డేపల్లి పాపయ్యగౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాపయ్యగౌడ్ మాట్లాడుతూ మండలంలోని 14 గ్రామాల్లో బీజేపీ బలపర్చిన సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థిని గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు గోవర్ధన్‌గౌడ్, రంగ జంగమయ్యగౌడ్, రమాదేవి, వీరస్వామి, సురేష్, సాయి, సత్యనారాయణ, శ్రీలత, రామకృష్ణ, శ్రీనివాస్, బల్‌దేవ్‌రెడ్డి, నాగరాజు, లక్ష్మీనారాయణ, రాంరెడ్డి పాల్గొన్నారు.

అవంతి కళాశాలలో జాతీయ స్థాయి సైన్స్‌ఫెయిర్

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గుంతపల్లిలోని అవంతి సైంటిఫిక్ టెక్నాలజీకల్ రీసెర్చ్ అకాడమీలో సోమవారం జాతీయస్థాయి సైన్స్‌ఫెయిర్ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అబ్దుల్లాపూర్‌మెట్‌లోని ప్రభుత్వ పాలిటక్నిక్ కళాశాల సైన్స్ విభాగాధిపతి ఎం. బాలాజీ హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతిప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. కంప్యూటర్ సైన్స్ కోర్సులోని మెలకువలను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన పలు రకాల నమూనాలను సైన్స్‌ఫెయిర్‌లో ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాశాల జనరల్ సెక్రటరీ డాక్టర్ ప్రియాంక, డైరెక్టర్ డాక్టర్ జయప్రద, ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరరావు, రాంచంద్రారెడ్డి, క్యాంపస్ ఇన్‌చార్జి బోసు, పీఆర్‌ఓ శ్రీనివాస్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

సరూర్‌నగర్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): బాలాపూర్ మండలం నాదర్‌గుల్‌లోని జడ్పీ హైస్కూల్‌లో 1996-97లో పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు సోమవారం ఇక్కడి ఓ ఫామ్‌హౌజ్‌లో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. నాటి గురువులను ఆహ్వానించి ఘనంగా సన్మానించి వారి బోధనా విధానాలను గుర్తుకు తెచ్చుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకుని, ప్రస్తుతం ఎవరెవరు ఏయే స్టేజీలో ఉన్నారనే విషయాలపై చర్చించుకున్నారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బధిరుల ఆశ్రమ పాఠశాలకు డైనింగ్ టేబుళ్ల అందజేత

ఓల్డ్‌మలక్‌పేట, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : మలక్‌పేటలోని బధిరుల ఆశ్రమ పాఠశాలకు ఐడీబీఐ కాచిగూడ బ్రాంచి వారు పది డైనింగ్ టేబుళ్లను వితరణ చేశారు. సోమవారం బ్యాంకు రీజినల్ మేనేజర్ సందీప్ పట్నాయక్ ఆధ్వర్యంలో డైనింగ్ టేబుళ్లను పాఠశాల ప్రిన్సిపాల్ కె.నాగలక్ష్మికి అందజేశారు. విద్యార్థులకు డైనింగ్ టేబుళ్లు ఎంతగానో ఉపయోగపడతాయని ఉచితంగా టేబుళ్లను అందజేసిన ఐడీబీఐ వారికి ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఐడీబీఐ కాచిగూడ బ్రాంచి మేనేజర్ సుష్మారామరాజు, ఉద్యోగులు భార్గవి, ఉదయ్‌కిరణ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ మీర్‌పేట్ చైర్మన్‌గా శ్రీనివాస్

సరూర్‌నగర్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎస్సీ సెల్ మీర్‌పేట్ కార్పొరేషన్ చైర్మన్‌గా మీర్‌పేట్‌లోని అనురాగ్ కాలనీకి చెందిన పార్టీ నాయకుడు మాదరి శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు ఎస్సీ సెల్ నియోజకవర్గం అధ్యక్షుడు క్యారగారి శ్రీధర్ జారీ చేసిన నియామక పత్రాన్ని సోమవారం పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా కేఎల్లార్ మాట్లాడుతూ దళితుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీపీసీసీ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి, బి.జంగయ్య, భాను, జానయ్య, శ్రీధర్ పాల్గొన్నారు.

'ప్రజలకు ఉప్పల ఫౌండేషన్ చేయూత'

మన్సూరాబాద్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): అన్నివర్గాల పేద ప్రజలను ఆదుకునేందుకు ఉప్పల ఫౌండేషన్ ఎల్లవేళలా ముందుంటుందని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ పరిధిలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం పేద వికలాంగులైన వరంగల్‌కు చెందిన తెజావత్ బాలు, ఇస్లా గీతల పెళ్లికి ఉప్పల ఫౌండేషన్ ద్వారా పుస్తెమట్టెలు, చీర గాజులను ఐవీఎఫ్ ప్రథమ మహిళా అధ్యక్షురాలు ఉప్పల స్వప్నతో కలిసి శ్రీనివాస్‌గుప్తా పంపిణీ చేశారు. కార్యక్రమంలో రమణయ్య, గుడ్ వే ఫౌండేషన్(వికలాంగుల సేవా సంస్థ) అధ్యక్షురాలు ఎరుపల్లి మంగమ్మ, ప్రధాన కార్యదర్శి షన్ముఖరావు, కోటగిరి దైవాదీనం పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌కు తోటి ఉద్యోగులు ఆర్థిక సాయం

వనస్థలిపురం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ప్రమాదానికి గురైన కానిస్టేబుల్‌కు ఆర్థిక సహాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు తోటి కానిస్టేబుళ్లు. ఎల్బీనగర్ ట్రాఫిక్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీకాంత్‌కు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై రెండు చేతులు విరిగిపోయాయి. దీంతో శ్రీకాంత్ ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని 2012 బ్యాచ్‌కు చెందిన సదరు కానిస్టేబుల్ బ్యాచ్ సభ్యులు ముందుకు వచ్చి వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ రాజేందర్ ఆధ్వర్యంలో నిధులు సమకూర్చారు. ఈ మేరకు సమకూరిన రూ.52వేల నగదును సోమవారం శ్రీకాంత్‌కు అందజేశారు. బీ.రాజేంద్ర, ప్రసాద్‌రెడ్డి, కృష్ణ, గణేషా పాల్గొన్నారు.

అంబేడ్కర్, జ్యోతిరావుపూలే విగ్రహాల ఆవిష్కరణ

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్ రాజీవ్ గృహకల్పలో జై భీమ్ ఆర్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతనంగా ప్రతిష్ఠించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మాజ్యోతిరావుపూలే విగ్రహాలను ఆదివారం రాత్రి కేంద్ర మాజీమంత్రి సర్వే సత్యనారాయణ, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు క్యామ మల్లేష్ ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ విగ్రహ దాత ఈదమ్మల బలరాం, ఆర్టీసీ మాజీ డీవీఎం రాములు, జంగయ్య, గ్యారల శ్రీనివాస్, కృష్ణారెడ్డి, కృష్ణ, గిరీష్, భాస్కర్, రాజ్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో మల్‌రెడ్డి రాంరెడ్డి పూజలు

చంపాపేట, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో సోమవారం రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. మల్‌రెడ్డి రాంరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయన వినాయకస్వామి, ధ్యానాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పండితులు, అర్చకులు రాంరెడ్డికి వేద ఆశీర్వచనం అందించి స్వామి వారి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, ఆలయ మాజీ ధర్మకర్త, మాలల ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బేర బాలకిషన్, ఎన్టీఆర్‌నగర్ కిల్లా మైసమ్మ ఆలయ మాజీ చైర్మన్ కందికంటి శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.

మణిపూర్ ప్రజల సంక్షేమానికి చొరవ తీసుకోవాలి

● రాజస్థాన్ మాజీ ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలట్

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మణిపూర్ ప్రజల సంక్షేమం కోసం బీజేపీ, కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని, అక్కడ జరగుతున్న అరాచకాలను దృష్టిలో ఉంచుకుని రాజకీయ డ్రామాను ఆపాలని రాజస్థాన్ మాజీ ఉపముఖ్యమంత్రి సచిన్ పైలట్ హితవుపలికారు. నగర శివారులోని అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కవాడిపల్లి గ్రామంలో శ్రీ దేవ్‌నారాయణ్ వీర్ గుజ్జర్ సమాజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన స్వామి దేవ్ నారాయణ్ ఆలయ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా ఏళ్లుగా మణిపూర్ ప్రజలు తీవ్ర సంక్షోభంలో జీవనం కొనసాగిస్తున్నారని, సీఎంను కాపాడే ప్రయత్నాలు మానుకుని, కేంద్ర ప్రభుత్వం ప్రజలకు భద్రత, వారి సంక్షేమం కోసం చర్యలు తీసుకోవాలని సూచించారు. అక్కడి సీఎం నెలకొన్న పరిస్థితిని చక్కదిద్దలేరని తెలిసినా కేంద్రం, బీజేపీ ప్రజల క్షేమం పక్కన బెట్టి పవర్ కోసం వెంపర్లాడుతోందన్నారు. ప్రజలు తీవ్ర ఆందోళనకర పరిస్థితిలో జీవిస్తున్నారని కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం సహించలేమని తెలిపారు. మణిపూర్‌లో బీజేపీ కేవలం అధికారం కోసమే పాకులాడుతున్నదని ప్రజా క్షేమాన్ని విస్మరించిందన్నారు. బీజేపీకి మణిపూర్‌లో నాయకత్వలోపం వల్ల సంక్షోభాన్ని ఎదుర్కొంటుందన్నారు. మణిపూర్ సంక్షోభంపై శాసనసభలో అవిశ్వాసాన్ని ఎదుర్కోలేక ముఖ్యమంత్రి రాజీనామా చేశారన్నారు. ప్రధాని మణిపూర్‌లో పర్యటించి పరిస్థితులు చక్కదిద్దాలని కోరారు.

కులగణన ప్రశంసనీయం.. ఆదర్శం..

రాహుల్‌గాంధీ ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణన ప్రశంసనీయమే కాకుండా దేశానికి ఆదర్శమని సచిన్‌పైలట్ కొనియాడారు. కులగణన ద్వారా అన్నివర్గాలకు సమన్యాయంగా నిధుల కేటాయింపు జరుగుతుందన్నారు. దశాబ్దాలుగా రాజస్థానీలు ఇక్కడ స్థిరపడి రాష్ట్ర సంక్షేమం, ఆర్థికవ్యవస్థలో భాగస్వాములవుతూ వస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాజ్యసభ మాజీ సభ్యులు హనుమంతరావు, ఏఐసీసీ కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డితో పాటు గుజ్జర్ సమాజ్ ప్రతినిధులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సచిన్ పైలట్

ఎమ్మెల్యే గారూ.. పార్కు స్థలాలపై దృష్టిపెట్టండి

● సబితారెడ్డికి బీజేపీ నేతల వినతి


ఎమ్మెల్యే సబితారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వెంకట్‌రెడ్డి

సరూర్‌నగర్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలో కబ్జాలకు గురవుతున్న కోట్లాది రూపాయల విలువైన వేలాది గజాల ఖాళీ(పార్కు) స్థలాలను కాపాడడానికి చర్యలు తీసుకోవాలని బీజేపీ బడంగ్‌పేట్ శాఖ మాజీ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి ఎమ్మెల్యే పి.సబితారెడ్డిని కోరారు. ఈ మేరకు సోమవారం ఆమెను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం నాదర్‌గుల్‌లోని బీజేపీ కార్యాలయంలో పార్టీ క్లస్టర్-1,2 అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, వీరకర్ణారెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు తర్రె మల్లేశ్‌యాదవ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. కార్పొరేషన్‌లోని 18వ డివిజన్‌లోని అయోధ్యనగర్ లేఅవుట్‌లో 1600 గజాలు, 19వ డివిజన్‌లోని గాయత్రీహిల్స్ లేఅవుట్‌లో 400 గజాలు, 23వ డివిజన్‌లోని మారుతీనగర్ లేఅవుట్‌లో 2200 గజాలు, 30వ డివిజన్‌లోని ఎంసీఆర్ కాలనీలో 2000 గజాలు, 31వ డివిజన్‌లోని బాలాజీనగర్‌లో 400 గజాలు, మునిసిపల్ కాలనీ లేఅవుట్‌లో 5100 గజాలు.. వెరసి మొత్తం 11,500 గజాల ఖాళీ(పార్కు) స్థలాలు అన్యాక్రాంతమయ్యాయని వెంకట్‌రెడ్డి వివరించారు. సదరు కబ్జాలపై తాము జిల్లా కలెక్టర్‌కు, సీడీఎంఏకు, మునిసిపల్ కమిషనర్‌కు, టీపీవోకు, గత పాలకవర్గంలోని మేయర్‌కు సైతం దఫదఫాలుగా వినతిపత్రాలు అందజేశామని, అయినా ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన ఆరోపించారు. వాటిని కాపాడాల్సిన అధికారులు సైతం అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారని ఆయన విమర్శించారు. ఆయా స్థలాలకు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి, అక్రమ పద్ధతుల్లో ఇతరులకు విక్రయిస్తున్నారని, కొందరు బడా వ్యక్తులువాటిని కొనుగోలు చేసి భారీ కట్టడాలు చేపడుతున్నారని వెంకట్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే అయినా వీటిపై దృష్టి సారించి విలువైన ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించడానికి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

సరూర్‌నగర్ కమర్షియల్ కాంప్లెక్స్‌ను ఖాళీ చేయండి

● వ్యాపారులకు హెచ్ఎండీఏ ఆదేశాలు జారీ
● భద్రతా ప్రమాణాలను దృష్టిలో ఉంచుకుని చర్యలు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్ కమర్షియల్ కాంప్లెక్స్‌లో దుకాణాలు నిర్వహిస్తున్న వ్యాపారులు తక్షణమే ఖాళీచేసి వెళ్లాలని హెచ్ఎండీఏ అధికారులు ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాంప్లెక్స్‌లో మొత్తం 32 షాపులు(బ్లాకులు) ఉన్నాయని, ఏళ్ల క్రితం నిర్మించిన దుకాణాలు శిథిలావస్థకు చేరిన నేపథ్యంలో కూలిపోయే ప్రమాదముందని, తద్వారా ప్రస్తుతం వ్యాపారాలు నిర్వహించే వారితోపాటు సమీప ప్రాంతాల ప్రజలకు తీవ్రనష్టం జరిగే అవకాశముందని వారు హెచ్చరించారు. మంగళవారం షాపులను ఖాళీ చేయాలని సూచించారు. ఇదిలాఉండగా, సరూర్‌నగర్ కమర్షియల్ కాంప్లెక్స్‌ను 1981లో హెచ్ఎండీఏ నిర్మించింది. అప్పటి నుంచి 2008 వరకు వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలకు లీజుకు ఇచ్చారు. అయితే లీజు గడువు పూర్తయిన తర్వాత భవనం పునాదులు, నిర్మాణం బలహీనపడడంతో వ్యాపార కార్యకలాపాలు కొనసాగించవద్దని ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ విభాగం కొద్ది రోజుల క్రితం హెచ్ఎండీఏకు నివేదికను అందజేసింది. ఈ నేపథ్యంలో అధికారులు దుకాణదారులకు ఇటీవల నోటీసులు జారీచేశారు. కాంప్లెక్స్ ప్రమాదంలో ఉన్నందున తక్షణమే విడిచి వెళ్లాలని సూచించారు. అయితే దీనిని కొందరు నిరాకరిస్తూ హైకోర్టును ఆశ్రయించినా ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో కాంప్లెక్స్‌ను ఖాళీచేయించేందుకు హెచ్ఎండీఏ అధికారులు సిద్ధమయ్యారు. వ్యాపారులు, ప్రజల ప్రాణాలు, ఆస్తుల భద్రత దృష్ట్యా మంగళవారం ఖాళీ చేయించనున్నట్లు పేర్కొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించుకోవాలి

● పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి


మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించుకోవాలని ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం అబ్దుల్లాపూర్‌మెట్‌లోని వైఎస్ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన మండలస్థాయి కార్యకర్తల సమావేశానికి ఆయనతో పాటు బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి క్యామ మల్లేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంచిరెడ్డి మాట్లాడుతూ గ్రూపులకు తావివ్వకుండా కలిసి కట్టుగా పనిచేసి అభ్యర్థులను గెలిపించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని.. బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని వివరించాలని సూచించారు. క్యామ మల్లేష్ మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ చిత్తుగా ఓడిపోవడం ఖాయం అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొత్త కిషన్‌గౌడ్, జక్క రాంరెడ్డి, కిరణ్‌కుమార్‌గౌడ్, ధనుంజయగౌడ్, చక్రవర్తిగౌడ్, జగదీశ్వర్, వెంకట్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సీక సాయికుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

కుంభమేళాలో సైబర్ నేరాల నివారణపై అవగాహన



మహాకుంభ మేళా వేడుకల్లో సైబర్ నేరాలపై సీ డాక్ బ్యానర్

కొత్తపేట, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కేంద్ర కమ్యూనికేషన్, సమాచార సాంకేతిక మంత్రిత్వశాఖ వారి సెంటర్‌ఫర్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్(సీ-డాక్)హైదరాబాద్ ఆధ్వర్యంలో కుంభమేళాలో సైబర్ నేరాల నివారణపై 45రోజుల అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయని సీడాక్ హైదరాబాద్ సీనియర్ డైరెక్టర్ సీహెచ్ఏఎస్ మూర్తి తెలిపారు. మంగళవారం సేఫర్ ఇంటర్ నెట్ డే సందర్భంగా ప్రయాగ్ రాజ్‌లో మరిన్ని ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వెల్లడించారు. సీడాక్ ప్రత్యేక స్టాల్‌లో నిపుణులు కుంభమేళా సందర్శకులకు వీడియోలు ప్రదర్శిస్తూ సైబర్‌నేరాల తీరును, నివారణకు సూచనలను వివరిస్తున్నారని తెలిపారు. పోస్టర్లు, బ్యానర్లు, ప్లకార్డులనూ ప్రదర్శిస్తూ పలు రకాల సైబర్‌నేరాల పట్ల ఎలా అప్రమత్తంగా ఉండాలో అవగాహన కల్పిస్తున్నారని పేర్కొన్నారు. ఇంగ్లీషు, కన్నడ, తెలుగు, హిందీ తదితర భాషల్లో సులభంగా అర్థమయ్యేలా సూచనలతో బ్యానర్లు, పోస్టర్లు ప్లకార్డులూ రూపొందించారన్నారు. జనవరి 19 నుంచి సీడాక్ బృందం ప్రయాగరాజ్‌లో సైబర్ భద్రతపై కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు.మహాకుంభమేళాలో సీడాక్ జాయింట్ డైరెక్టర్ జితేష్ చౌదరి, అసోసియేట్ డైరెక్టర్ హరిబాబు, ప్రతినిధులు ఎంవీఎస్‌రావు, ఇటిక్యాల నరేష్, అరుణ్ రాకేష్ బృందం అవగాహన కల్పిస్తున్న వారిలో ఉన్నారు.

మేం కట్టే పన్నులను మా ప్రాంతాభివృద్ధికే కేటాయించండి

● జోనల్ కమిషనర్‌కు కార్పొరేటర్ నర్సింహారెడ్డి విన్నపం

హయత్‌నగర్/మన్సూరాబాద్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ ప్రాంత ప్రజలు కడుతున్న పన్నులు తప్పుదోవ పట్టకుండా మా నియోజకవర్గ అభివృద్ధికే కేటాయించాలని మన్సూరాబాద్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి కోరారు. ఈ మేరకు ఎల్బీనగర్ జోనల్ కార్యాలయంలో సోమవారం జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆయన పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ డివిజన్‌లలో కోట్ల రూపాయలు పన్నుల పేరుతో వసూలు చేస్తున్నారని అభివృద్ధి పనులకు మాత్రం తక్కువగా ఖర్చు పెడుతున్నారన్నారు. నిధులు సరిగా కేటాయించకపోవడంతో నియోజకవర్గంలోని పలు ప్రాంతాలతో పాటు ప్రధానంగా మన్సూరాబాద్‌లో సమస్యల పరిష్కారం నత్తనడకన సాగుతున్నాయన్నారు. అందుకు తగ్గట్టుగా జీహెచ్ఎంసీ నిధులు మంజూరు చేయాలని కోరారు. ఎలాంటి సౌకర్యాలు లేని చోట కూడా అధికారులు ఇంటి పనులు వసూలు చేస్తున్నారని తెలిపారు. టెండర్ పిలిచిన పనులకు వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరారు. అందుకు స్పందించిన జడ్సీ మన్సూరాబాద్ డివిజన్‌లో సీసీరోడ్లు ఇతర పనులకు గాను రూ. 2కోట్లు మంజూరు చేశారు. కాగా డివిజన్‌లోని ఆదిత్యనగర్, సీపీఆర్, టీనగర్, వినాయకనగర్, శివంహిల్స్, నందిహిల్స్, శివగంగా, పవనగిరి 1,2 కాలనీలకు సీసీ రోడ్డుకు, సహారా ఎస్టేట్స్‌లోని ఇంటర్నల్ నాలా నిర్మాణానికి నిధుల మంజూరయ్యాయని, తొందరలోనే పనులు ప్రారంభించుకోనున్నట్లు తెలిపారు. దీంతో కార్పొరేటర్ జడ్సీకి కృతజ్ఞతలు తెలిపారు.


జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

ఉమెన్స్ థీమ్ పార్క్ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి


జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న అరవింద్‌రెడ్డి, కాలనీవాసులు

వనస్థలిపురం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని ఎన్జీవోస్ కాలనీలోని ఉమెన్స్ థీమ్ పార్క్ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కాలనీవాసులు ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు బీఆర్ఎస్ బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి ఆధ్వర్యంలో కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ గతంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి రూ.80లక్షలతో ఎన్జీవోస్ కాలనీలోని ఉమెన్స్ థీమ్ పార్కును మంజూరు చేసి పార్కు సివిల్ పనులను పూర్తిచేశారని, మిగిలిపోయిన పార్కు బ్యూటిఫికేషన్, వాకింగ్‌ట్రాక్, ఇతర అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వాణి, తరుణం, కౌసర్, సంధ్య, సత్య తదితరులు పాల్గొన్నారు.

సొంత కార్లు.. అద్దె వాహనాలుగా..

(5వ పేజీ తరువాయి)

యువతకు అందించింది. కొందరు అధికారులు డీఓసీ డ్రైవర్లను వేధించి.. తమ వద్ద పని చేయకుండా చేశారు. అనంతరం సొంత కార్లను అద్దె వాహనాలుగా వినియోగిస్తూ వచ్చారు.

జీహెచ్ఎంసీలో దాదాపు 800మంది అధికారులకు వాహన సదుపాయం ఉంది. ఇందులో సంస్థ సొంత, అద్దె వాహనాలున్నాయి. ప్రాథమిక పరిశీలనలో గుర్తించిన 26 మందికి నోటీసులు ఇవ్వగా.. కేంద్ర, జోనల్, సర్కిల్ కార్యాలయాల పరిధిలో సొంత కార్లను అద్దె వాహనాలుగా ఎంత మంది వినియోగిస్తున్నారన్న వివరాలపై ఆరా తీస్తున్నారు. సొంత నంబర్ ప్లేట్ వాహనాలు ఎంత మంది వాడుతున్నారు..? వాటిలో అద్దె ఎన్ని వాహనాలకు చెల్లిస్తున్నారన్నది గుర్తిస్తే అక్రమాలు బయటపడుతాయని ఓ అధికారి తెలిపారు. సొంత కార్లను అద్దె వాహనాలుగా చూపుతోన్న అధికారులు 80 మందికిపైగా ఉంటారని రవాణా విభాగం వర్గాలు చెబుతున్నాయి. వీరికి నెలకు రూ.27.20 లక్షల చొప్పున యేటా రూ.3.26 కోట్లు చెల్లిస్తున్నారు.

రెండేళ్ల వరకు ఇవే నీళ్లు..

(5వ పేజీ తరువాయి)

అందిస్తున్నారు. ఆయా ప్రాంతాలకు ప్రస్తుతం సరఫరా చేసే నీరు ఏమాత్రం సరిపోవడం లేదు.

అదనపు జలాలు తీసుకురాకపోవడం వల్లే..

ఉమ్మడి రాష్ట్రంలో చేపట్టిన కృష్ణా ఫేజ్-3, గోదావరి ఫేజ్-1 ప్రాజెక్టులతో నగరానికి నీళ్లు అందుతున్నాయి. ఆ సమయంలో 1200మిలియన్ లీటర్ల నీళ్లు నగరానికి చేరడంతో అప్పట్లో నీటి ఇబ్బందులు తలెత్తలేదు. హైదరాబాద్ మహానగరం ఈ పదేళ్లలో ఔటర్ రింగ్‌రోడ్డును హద్దుగా చేసుకొని శరవేగంగా విస్తరిస్తోంది. గేటెడ్ కమ్యూనిటీ కాలనీలు, బహుళ అంతస్తుల భవనాలు పెద్ద ఎత్తున వస్తున్నాయి. పదేళ్ల క్రితం వరకు నగరంలో ఏ స్థాయిలో (2600మిలియన్ లీటర్లు) నీళ్లు వచ్చాయో.. ప్రస్తుతం అంతే వస్తున్నాయి. ఈ పదేళ్లలో అదనంగా జలాలు తీసుకొచ్చేందుకు ఒక్క ప్రాజెక్టు చేపట్టలేదు. ప్రస్తుతం నగరంలో సరఫరా అవుతున్న జలాలనే మరో రెండేళ్ల వరకు సరిపుచ్చుకోవాల్సిన అవసరముందని, గోదావరి రెండో ఫేజ్ జలాలు అందితేనే పూర్తిస్థాయిలో నీళ్లు ఇవ్వగలమని అధికారులు అంటున్నారు.

'అధ్వానంగా ఉన్న డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దా'

సరూర్‌నగర్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): తాను కార్పొరేటర్‌గా ఎన్నికవక ముందు నిండా సమస్యలతో అధ్వానంగా ఉన్న నాదర్‌గుల్ 31వ డివిజన్‌లోని శ్రీసాయిబాలాజీ హోమ్స్ ఫేజ్-2 కాలనీని గడిచిన ఐదేళ్లలో అన్ని విధాలుగా అభివృద్ధి చేశానని బడంగ్‌పేట్ మాజీ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి అన్నారు. సోమవారం కాలనీలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో పారిజాతారెడ్డి పాల్గొనగా, కాలనీవాసులు ఆమెను ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా తమ కాలనీలో పలు అభివృద్ధి పనులు చేపట్టినందుకుగాను కాలనీవాసులు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్నాల రాజేందర్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

రాచకొండ పరిధిలో సీజ్ చేసిన వాహనాల వేలం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రాచకొండ కమిషనరేట్ పరిధిలో వివిధ పోలీస్‌స్టేషన్లలో సీజ్ చేసిన, వీధుల్లో వదిలేసిన 152 ద్విచక్ర వాహనాలను వేలం వేసేందుకు అధికారులు నిర్ణయించారు. అంబర్‌పేటలోని రాచకొండ సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్ క్వార్టర్స్‌లో ఈనెల 13న బహిరంగ వేలంలో వాహనాలను విక్రయిస్తారు. వాహనాలను కొనుగోలు చేయదలచుకున్నవారు 12వ తేదీన వాహనాలను పరిశీలించుకొని, 13న నిర్వహించే బహిరంగ వేలంలో పాల్గొన వచ్చని పోలీస్ అధికారులు తెలిపారు. మరిన్ని వివరాల కోసం 8712662661, 8008338535 నెంబర్లపై సంప్రదించాలని కోరారు.

చోరీకి పాల్పడ్డ ఇద్దరు నిందితుల అరెస్ట్

● రూ.2.60లక్షల విలువైన నగలు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఇళ్లలో చోరీకి పాల్పడిన ఇద్దరు దొంగలను మీర్‌చౌక్ పోలీసులు అరెస్ట్ చేశారు. మీర్‌చౌక్ పోలీస్టేషన్‌లో సోమవారం ఏసీపీ ఎస్ఎస్ఎస్‌వీ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం యూపీకి చెందిన మహ్మద్ నూర్ హసన్(33) నగరంలోని నూర్‌ఖాన్‌బజార్‌లో ఉంటూ ఫొటో ఫ్రేమ్ వర్క్‌లు చేస్తున్నాడు. ఇతడు డబీర్‌పురాకు చెందిన హిమాయత్ హుస్సేన్ అన్సారీ అలియాస్ హియాయత్(23)తో జతకలిశాడు. చేస్తున్న పనిలో తగినంత ఆదాయం రాకపోవడంతో చోరీలు చేయాలని ఇద్దరూ కలిసి నిర్ణయం తీసుకున్నారు. వీరిద్దరూ కలిసి ఈనెల 4న ఎంజీబీఎస్ ప్రాంతంలో ఓ ఇంట్లో చోరీ చేశారు. బీరువాలోని బంగారు నగలు, నగదు చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నిందితులు చోరీ సొత్తును విక్రయించే ప్రయత్నంలో ఉండగా గుర్తించిన మీర్‌చౌక్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.2.60 లక్షల విలువైన నగలను స్వాధీనం చేసుకున్నారు. దొంగలను అరెస్ట్ చేసిన పోలీసు సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

పోలీసుల అదుపులో పాత నేరస్థుడు

మన్సూరాబాద్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): చోరీకి పాల్పడుతుంటే పట్టుకునేందుకు యత్నించగా పారిపోయిన ఓ దుండగుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కూలీ పనులు చేసుకుంటూ సాగర్ రింగురోడ్డు వద్ద ఫుట్‌పాత్‌పై ఉండే సూర్యాపేట జిల్లా మట్టంపల్లికి చెందిన రమావత్ సైదులు నాగోల్‌లోని అమరావతి బార్‌లో ఆదివారం రాత్రి 1గంటల సమయంలో చోరీకి యత్నించాడు. ఇది గమనించిన అక్కడి సెక్యూరిటీగార్డు అతడిని పట్టుకునేందుకు ప్రయత్నించగా తప్పించుకున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని సోమవారం ఉదయం నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా నిజం ఒప్పుకున్నాడు. దీంతో అతడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. కాగా రమావత్ సైదులుపై గతంలో 27 దొంగతనాల కేసుల్లో ప్రమేయం ఉందని, ఇతడు పాతనేరస్థుడిగా గుర్తించారు.

ట్రాఫిక్ నిబంధనలపై డ్రాయింగ్ పోటీలు

కొత్తపేట : ట్రాఫిక్ నిబంధనలపై డ్రాయింగ్ పోటీల్లో విద్యార్థుల స్పందన అభినందనీయమని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఇన్‌స్పెక్టర్ రాచపూడి తెలిపారు. సోమవారం హయత్‌నగర్ వివేకానంద హైస్కూల్, మన్సూరాబాద్ విజ్ఞాన్ హైస్కూల్ నుంచి 67 మంది విద్యార్థులు రాచకొండ పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కును సందర్శించారు. రహదారి భద్రత అవగాహనలో భాగంగా వారికి లెక్చర్ హాల్‌లో డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. సేఫ్టీ ట్రెయినర్ ప్రవీణ్ వారికి నిబంధనలు పరిచయం చేశారు. సిమ్యులేటర్ లో వాహనాల డ్రైవింగ్‌పై అవగాహన కల్పించారు. కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎస్ఐ నర్సింహారావు, వీసీ రమేష్ వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు, పలు ప్రాంతాల్లో సాధారణ ప్రజలకు, డ్రైవర్లకు రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనల ప్రాధాన్యతలపై అవగాహన కల్పించారన్నారు. నాచారంలోని 10 ప్రాంతాల్లో నిబంధనలను వివరించారని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.